
నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 67



# నాన్న కథలన్నీ మంచివే! మంచి కోసం రాసినవే!!

**- రాచకొండ ఉమాకుమార శాస్త్రి**

విశాఖపట్నం అంటే అక్కడి సముద్రం, యారాడ కొండ ఎలా గుర్తొస్తాయో, మంచి కథలంటే 'రాచకొండ' అతని రచనా సాగరం అలాగే గుర్తొస్తాయి. రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనలు అట్టడుగు వర్గ ప్రజల దైన్యాన్ని చిత్రించి, కన్నీళ్ళు పెట్టించడమే కాదు, పరిష్కారాలను కూడా సూచిస్తాయి. 'లాయర్ ఛాత్రిబాబు' గొప్ప రచయితే కాదు, గొప్ప మనిషి కూడా. ఆ ప్రజా రచయిత కుమారుడు రాచకొండ ఉమా కుమార శాస్త్రి జ్ఞాపకాలు ఈ వారం మీ కోసం...





## రాచకొండ నుంచి విశాఖజిల్లాకు వలస

ఎన్నో ఏళ్ల కిందట 'రాచకొండ గురుభట్టు' అనే మా పూర్వీకులు ఒకాయన 'రాచకొండ' గ్రామం నుంచి విశాఖ జిల్లా వైపు వలస వచ్చారని నాన్నగారు చెబుతుండేవారు. ఆ విధంగా మనం 'ఇటువైపు వాళ్లం అయ్యాం' అనేవారు. నల్లగొండలోని ఆ గ్రామాన్ని 1983 సెప్టెంబరులో నాన్నగారు, చలసాని ప్రసాద్ మరికొందరు వెళ్లి చూసివచ్చారు కూడా.

రాచకొండ నారాయణమూర్తి, సీతారామలక్ష్మి దంపతుల అయిదుగురి సంతానంలో రెండోవారు మా నాన్నగారు. 1922 జూలై 30న అప్పటి గంజాం జిల్లాలోని ఇప్పటి శ్రీకాకుళంలో పుట్టారు. చిన్నప్పుడు కొన్నాళ్లు అనకాపల్లి దగ్గర తుంపాలలో ఉన్నారు.

డిగ్రీ బి.ఎ. (ఆనర్స్) విశాఖపట్నంలోని ఎ.వి.ఎన్. కళాశాలలోనూ న్యాయ శాస్త్రం మద్రాసు 'లా' కళాశాలలోనూ చదివారు. కోట్ల విజయభాస్కరరెడ్డి, దామోదరం సంజీవయ్య నాన్నగారికి 'లా' సహాధ్యాయులు.

## బాల్యం నుంచి బతుకుపోరు తెలుసు

నాన్నగారు చిన్నప్పుడు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డారు. కాలేజీ రోజుల్లో ఆనర్స్ క్లాసులకు కాళ్లకు చెప్పులు లేకుండా వెళ్లేవారట! 'లా' పరీక్ష పాస్ అయినా ఫీజు బాకీ ఉండడం వల్ల వెంటనే సర్టిఫికెట్ తీసుకోలేక పోయారట! 'నేను పడిన ఇబ్బందులు మీరు పడకూడదు అని మీకు డబ్బులు ఇస్తున్నాను. దుర్వినియోగం చేయకండి, వెధవల్లారా!' అని హెచ్చరిస్తూ మా అన్నదమ్ము లకు పాకెట్ మనీ ఇచ్చేవారు.

## అలక తీర్చడానికి పిండివంటలు


నాన్నగారు అందంగా చురుగ్గా మిగతా అందరి కంటే తెలివిగా ఉండడం చేత కుటుంబసభ్యులందరికీ ఆయనంటే ఎంతో ఇష్టం. నాన్నగారికి కోపం వస్తే మేనమామ తెన్నేటి శంకర నారాయణ ఇంటి ముందున్న కొబ్బరిచెట్టు కింద పడుకునేవారట! అప్పుడు నాన్నను బుజ్జగించి, బ్రతిమాలి ఇంటికి తీసు కెళ్లి ఆయనకు ఇష్టమైన అన్ని రకాల పిండి వంటలు వండి పెట్టేవారట! పండుగ రోజులు కాని సమయంలో మా ఇంట్లో పిండివంటలు వండితే ఆ రోజు మా నాన్నగారికి శాంతి ప్రక్రియలు జరిగినట్లు లెక్క.

## క్లాసు పుస్తకాల కంటే క్లాసిక్ బుక్స్ ఇష్టం

నాన్నగారికి చిన్నప్పటి నుంచి స్నేహితులు ఎక్కువే! సరదాగా కబుర్లు చెప్పుకోవడంతో బాటు మిమిక్రీ చేయడం, వినోదం కలిగించడం, సంబరా లకు వెళ్లడం, సాయంత్రాలు ఎక్కువ సమయం విశాఖ బీచ్‌లో గడపడం చేసే వారు. క్లాసు పుస్తకాలు పెద్దగా చదివేవారు కాదు. క్లాసిక్ పుస్తకాలే ఎక్కువ చదివేవారు. ఆ వయస్సులో ఆయన చదివిన పుస్తకాలు ఎం.ఎ. లిటరేచర్ విద్యార్థి కూడా చదివి ఉండడని నేననుకుంటాను. 1935 నుంచి 1941 వరకు నాన్నగారి దినచర్య డైరీలో రాసుకున్నారు. అందులో తాను చదివిన పుస్తకాల లిస్టు రాసుకున్నారు. ఇలా చదువును నిర్లక్ష్యం చేయడాన్ని చూసి మా 'సింహం' బాబాయ్ ఆందోళన చెందేవారట! అయితే ఆఖరి సమయంలో క్లాసు పుస్తకాలు చదివి మంచి మార్కులతో పాస్ అయ్యేవారు. ఆనర్స్‌లో 'నాకు ఇష్టంలేని సబ్జెక్టు చదివిస్తున్నారు. నేను పరీక్షలకు వెళ్లను' అని వారం రోజులు నిరాహారదీక్ష చేశారట! మా నానమ్మ పిండి వంటలతో శాంతింప చేస్తే పరీక్షలకు వారం రోజుల ముందు మళ్లీ క్లాసు బుక్స్ చదివి హయ్యర్ సెకండ్ క్లాసులో పాసయ్యారట! 'లా' పరీక్షలు రాసిన తరువాత పేపర్‌లో ఫలితాలు చూస్తూ థర్డ్ క్లాసులో తన నెంబరు లేకపోవడం చూసి పరీక్ష తప్పా ననుకున్నారట! అప్పుడు మా 'సింహం' బాబాయ్ 'విశ్వం. నీది సెకండ్ క్లాస్ లిస్టులో ఉంది చూడు' అని చూపించారట! ఆశ్చర్యపోవడం నాన్నగారి వంత యిందట! నాన్నగారి విపరీతమైన గ్రహణశక్తికి ఇలాంటివి ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి.

## ఆది నుంచి ఎదిరించే గుణం

నాన్నగారికి చిన్నప్పటి నుంచీ అజమాయిషీని, అధికార ఒత్తిడిని ఎది రించే గుణం ఉండేది. మాతాతగారి మేనమామ సర్ బి.ఎన్.శర్మ అప్పటి బ్రిటిష్ పరిపాలనలో వైస్రాయి కేబినేట్‌లో రైల్వే మినిస్టర్‌గా ఉండేవారు. ఆయన ఎండాకాలంలో స్పెషల్ ట్రైన్‌లో విశాఖపట్నం నుంచి ఊటీ వెళ్తూ మా నాన్నగారిని, చిన్నాన్నగారిని తీసుకెళ్లారు. ఆ మర్నాడు ఊటీలో 'పేర్' అనే పండ్ల చెట్టును అన్నదమ్ములిద్దరూ సుమారు ముప్పయ్ అడుగుల ఎత్తుకి ఎక్కే శారు. అదే సమయంలో శర్మగారు బయటికి వచ్చి వీరిని చూసి 'చెట్టు దిగండి'


చివరి నవల 'ఇల్లు' రాస్తూ..

అని గదమాయిస్తూ ఆజ్ఞాపించారు. మా చిన్నాన్నగారు గబగబా చెట్టు దిగిపోయారు. నాన్నగారు దిగలేదు సరికదా 'నేను దిగను. ఏం చేస్తారు?' అని తిరిగి బిగ్గరగా అరిచారు. చేసేదేమీ లేక శర్మగారు నౌకర్లతో చెప్పి వెళ్లిపోయారట! ఇది తలచుకుని మా చిన్నాన్న ఇప్పటికీ ఆశ్చర్యపోతుంటారు. మా నాన్నగారికి మాటకారితనం కూడా ఎక్కువే! బి.ఎ.ఆనర్స్‌లో ఫిలాసఫీ లెక్చరర్ పాఠం చెబుతూ 'మనిషికి ఏ కోరికా ఉండకూడదు'' అన్నారట! నాన్నగారు వెంటనే లేచి, ' ఏ కోరికా ఉండకూడదని అనుకోవడం కూడా ఒక కోరికే కదా!'అన్నారట! ఆ లెక్చరర్ ఆశ్చర్యంగానూ మెచ్చుకోలుగాను చూశారని నాన్నగారు తరచూ నవ్వుతూ చెబుతుండేవారు.

భార్య శ్రీమతి రామం, కుమారులు లక్ష్మీనారాయణ ప్రసాద్, ఉమా కుమార శాస్త్రిలతో రావిశాస్త్రి



### క్రిమినల్ కేసుల్లో అబద్ధాలు ఆడక్కర్లేదు

చాలా కాలం నాన్నగారు సివిల్ కేసులే చూసేవారు. కానీ ఆయనకున్న సహజ తెలివితేటలు, సాహిత్య పిపాసవల్ల క్రిమినల్ కేసుల వైపు వెళ్లిపోయారు. ఒకసారి ఒక పెద్దాయన నాన్నగారిని 'సివిల్ కేసులకు క్రిమినల్ కేసులకు తేడా ఏముంది?' అని అడిగేరట! అప్పుడు నాన్నగారు 'సివిల్ కేసుల్లో మేము ఎక్కువగా అబద్ధం ఆడవలసి ఉంటుంది. క్రిమినల్ కేసుల్లో పోలీసులు ఆడేవి అబద్ధాలు అని మనం రుజువుచేస్తే చాలు' అని జవాబు చెప్పారట! కోర్టులో క్రాస్ ఎగ్జామినేషన్ అద్భుతంగా చేసేవారట! తనకు తెలీకుండానే సాక్షి బోనులో బోల్తా పడిపోయేవాడు. ఆర్యుమెంట్ కూడా క్లుప్తంగా ఉండేది. రెండు చేతుల చూపుడు వేళ్లను ముందుకు వెనక్కి చుడుతూ ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టేవారు. కేసు మిస్టరీ పువ్వులా విడిపోయేది. జూనియర్ లాయర్లు పొరపాటున తప్పు ప్రశ్న వేస్తే వెంటనే నాన్నగారు కలుగచేసుకుని రికార్డవకుండా సరిదిద్దేవారు. 'అడగవలసింది అడగకపోయినా పర్వాలేదు. అడగరాని ప్రశ్న మాత్రం అడగకూడదు' అని జూనియర్లకు హితవు చెప్పేవారు.

### ఇంట్లో వాళ్ల కోసమే యాత్రా స్థలాల సందర్శన

ఇంట్లో వారి సంప్రదాయాలకు, భావాలకు నాన్నగారు అడ్డుపడేవారు కాదు. మాపెద్దమ్మ 'రాచకొండ లక్ష్మీసోదెమ్మ'మహా భక్తురాలు. మా అమ్మగారు 'రాచకొండ రామం' గారికి కూడా విపరీతమైన దైవభక్తి. మా చిన్నప్పుడు ప్రతి వినాయక చవితికి బాబాగారి భజన మా ఇంట్లో చేసేవారు. నాన్నగారు అడ్డు చెప్పేవారు కాదు. శివుడు, షిర్డీ సాయిబాబా అంటే ఇష్టమనే చెప్పేవారు. ఎందుకంటే ఇద్దరూ నిరాడంబరులు కాబట్టి. ఏడాదికి ఓసారి కుటుంబ సభ్యులందరినీ 'సింహాచలం' తీసుకుని వెళ్ళే వారు. మా అమ్మగారిని తిరుపతిలోనే వివాహం చేసుకున్నారు.

### సాహిత్యాక్షరాభ్యాసం

నాన్నగారు 1936లో తొలికథ రాసినా 1938లో అచ్చయిన తొలికథ 'దేవుడే చేశాడు'. ఆయన డైరీ ప్రకారం తొలి నవల పేరు 'కోనయ్య'. అది అలభ్యం. అచ్చయిన తొలి నవల 'అల్పజీవి'. 1953లో 'భారతి'లో సీరియల్‌గా వచ్చింది. నాన్నగారి రచనా సర్వస్వంలో పాఠకులను కట్టిపడేసేవి ఉపమానాలు. పోలికల మాలికలు అల్లడంలో నాన్నగారు సిద్ధహస్తులు. శ్రీశ్రీ అంటే గురుభావం ఉంది. ఆరు సారాకథలు, మరోఆరు చిత్రాల్నీ, కలకంఠిలాంటి కథల్నీ, ఆడదాని సాహసం, ఇల్లు, రత్తాలు-రాంబాబు లాంటి నవలల్నీ ఎన్నో పాఠకలోకానికి అందించినప్పటికీ వాస్తవాలను వస్తువుగా తీసుకున్నారే తప్ప గాలిమేడలు కట్టలేదు. నాన్నగారి మాటల్లో చెప్పాలంటే... 'రచయితయిన ప్రతివాడూ తాను రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకి ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం ఉందని నేను తలుస్తాను. ప్రతి రచయితా తాను ఎవరి మంచి కోసం రాయాలో ఎప్పుడో ఒకప్పుడు నిర్ణయించుకుంటాడని నేననుకుంటూ ఉంటాను.'

## నాన్నగారికి నచ్చినవి

*సినిమా:* మొఘల్-ఇ-అజమ్

*పాట:* హైలో హైలెస్సా హంసకదా నా పడవ (భీష్మ)

*హీరోయిన్:* సురయా

*నటుడు:* పృధ్వీరాజ్ కపూర్

*గాయకుడు:* కె.ఎల్. సైగల్

*రాగం:* మాల్కోస్

*పిండివంటలు:* బొబ్బట్లు, బూరెలు, సేమియా పాయసం

*కూర:* వంకాయ

*ఎక్కువ ఇష్టంగా తినే పదార్థం:* పాలపై మీగడ

*స్నేహితులు:* చలసాని ప్రసాద్, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, ఎం.వి. రాయుడు, టి.కృష్ణాబాయి మరిఎందరో...

*బంధువు:* రాచకొండ నరసింహశర్మ (తమ్ముడు)

### అన్ని ప్రక్రియల్లోనూ ప్రవేశం ఉంది

నాన్నగారు 86 కథలూ 13 నవలలు 3 నాటకాలే గాక లెక్కలేనన్ని ముందుమాటలు, వ్యాసాలు రాశారు. ప్రత్యగాత్మ దర్శకత్వం వహించిన 'స్త్రీ' అనే సినిమాకి మాటలు కూడా రాశారు. 'రత్తాలు-రాంబాబు' నవల నాన్నగారు జైల్లో ఉండగా రాసినది. 1976లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో సీరియల్‌గా వచ్చింది. ఈ నవల అసంపూర్తిగా ఉండిపోయింది. 'పుణ్యం కొద్దీ పురుషుడు' పేరిట దీన్ని సినిమాగా తీశారు. అనివార్య కారణాల వల్ల తెలుగులో విడుదల కాలేదు. కన్నడంలో విడుదలైంది. 'అసంపూర్తిగా ఉన్న నవలలు పూర్తి చేయరా నాన్నా'! అని వారిని అడిగితే 'కష్టంరా! అప్పటి ఆ స్పిరిట్‌లోకి ఇప్పుడు వెళ్లడం కష్టం' అన్నారు. 'నాన్నగారూ' అని పిలవడం ఆయనకు నచ్చేదికాదు. 'నాన్న' అన్న ఏకవచన పిలుపులో ఉన్న సాన్నిహిత్యం గురించి వివరించేవారు.

### విశ్వనాథుడే కాదు..గరళకంఠుడు కూడా

తన కష్టాల్ని ఇతరులకు చెప్పేవారు కాదు. పైగా ఇతరుల కష్టాల్ని తాను మింగి వాళ్లకు ఉపశమనం కలిగించేవారు. క్లయింట్స్‌ని పీడించేవారు కాదు. వృత్తిలో నిజాయతీగా ఉండాలనీ, ఆడ క్లయింట్స్‌ని ఇంటికి రానీయకూడదనీ చెప్పేవారు. కేసు విషయంలో క్లయింట్ ఎంత ఎమోషనల్‌గా మాట్లాడినా తాను ఇన్వాల్వ్ కారు. కూల్‌గా మాట్లాడేవారు. వాదనలో విజృంభించే వారు.


సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఇష్టపడే నాన్నగారు 'జీవితంలో ఎప్పుడూ నిరుత్సాహ పడొద్దు అనీ, ధైర్యంగా ఉండాలనీ' అనేవారు.

## పూర్వజన్మ సుకృతం

రావి శాస్త్రి గారి అబ్బాయిగా పుట్టడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను. వారిచ్చిన స్ఫూర్తి, ప్రోత్సాహంతో 1983లో 'ఓ పోలీసోడి కథలో ఓ రోజు' అనే కథను రాస్తే అది ఆంధ్రజ్యోతిలో అచ్చయింది. కొన్ని కథలు మాత్రమే రాయగలిగాను. 2006లో 'చీకటి దీపాలు' కథ నవ్య వీక్లీలో వచ్చింది. నాన్నగారిలా రాయలేక పోతున్నాననే బెంగ కాస్త ఉంది. తండ్రిని మించిన తనయుడవ్వాలనే కోరిక లేదు. ఆయనకు ఉన్న మంచి పేరును పాడు చేయకుండా కాపాడుకుంటే చాలు అనుకుంటాను. అప్పట్లో విశాఖపట్నం మేయర్ శ్రీ డి.వి.సుబ్బారావు గారు అమెరికాకు వెళ్లినప్పుడు తనను తాను పరిచయం చేసుకుంటూ నేను విశాఖపట్నం మేయర్‌ను అన్నారట! వెంటనే అక్కడి అపరిచితులలో ఒకరు 'అయితే మీకు రావి శాస్త్రి గారు తెలుసా' అని ప్రశ్నించారట! సాహితీ రంగంలో విశాఖ అంటే రావిశాస్త్రి గారనే అభిప్రాయం అక్కడి వాళ్లకు కలిగి ఉండడం విని గర్వపడుతుంటాను. విశాఖపట్నం బీచ్ రోడ్డులో మహామహుల విగ్రహాల మధ్య నాన్నగారి మూర్తి కూడా చోటు చేసుకోవడం నాకు చాలా గొప్పగా ఉంటుంది.

## పురాణం వారే నవలలు రాయించారు

మేం విజయవాడ వెళితే మమ్మల్ని పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారింట్లో దించేవారు. వారి కుటుంబసభ్యులతో మేం కనకదుర్గ అమ్మవారి గుడికి వెళ్లేవాళ్లం. మా నాన్నగారు, శర్మగారు సాహితీ చర్చల్లో మునిగిపోయేవారు. పురాణం వారి ప్రోద్బలంతోనే నాన్నగారు నవలలు ఎక్కువ రాశారు. ఎవరి వాక్యాన్నైనా రచనలో వాడుకుంటే ఫలానా వారు ఇలా అన్నారని కోట్ చేయమనేవారు. స్వంతం అని చెప్పుకోకూడదనేవారు .



సోదరులు నరసింహశర్మ, మహదేవ శాస్త్రి, సుబ్బారావు, సోదరి నిర్మలతో రావిశాస్త్రి

## కేసు పోయిందని సిగరెట్లు మానేశారు

నా చిన్నప్పుడు నాన్నగారు సిగరెట్లు ఎక్కువగా కాల్చేవారు. బర్కిలీ కేప్స్టన్ ప్లెయిన్ వారి బ్రాండ్‌లు. ఒకసారి కోర్టులో ఇంకా కేసు పిలవ లేదని బయటికి వచ్చి ధూమపానంలో నిమగ్నులైనారట! అదే సమయంలో మరో లాయరు గారు మా నాన్నగారికి అప్పగించిన కేసు పిలిచి కొట్టేశారట! తాను సిగరెట్ కాల్చడం వల్లనే ఇలా జరిగిందని ఆ రోజు నుంచి సిగరెట్టు మానేశారు.

## నిరంతరం అధ్యయనం

ఎప్పుడూ చదువుతూనే ఉండేవారు. ఏదో ఒక పుస్తకం చేతిలో ఉండేది. ఆంగ్ల సాహిత్యాన్ని విపరీతంగా చదివేవారు. అప్పటి సహచర సాహితీవేత్తలందరూ మేధావులు, ప్రపంచ సాహిత్యంలో పరిచయం ఉన్నవారు కావడంతో విశ్వ సాహిత్యంతో నాన్నగారికి బాగా పరిచయం ఉంది. రాత్రులు రాస్తూ ఆలస్యంగా నిద్రపోయినా తెల్లవారు జామునే లేచేవారు.

## అందరిని ప్రేమించేవారు

మా మేనత్త డాక్టర్ జి.నిర్మల గారంటే నాన్నగారికి అమిత ఇష్టం. తల్లికిచ్చినంత గౌరవం ఇచ్చేవారు. ఎన్నో కుటుంబ తగాదా కేసులు ఆమెతో చర్చించేవారు. పిల్లలందరితో స్నేహంగా ఉండేవారు. వయసు తారతమ్యాలు కనబడేవి కావు. ఆయన సాహితీ కుటుంబంలో నాకు తెలిసిన వాళ్లు కొందరే! వాసిరెడ్డి సీతాదేవి, చలసాని ప్రసాద్, అత్తలూరి నరసింహారావు, టి.కృష్ణాబాయి, కాళీపట్నం రామారావు, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, ఆకెళ్ల కృష్ణమూర్తి, డి.వి.సుబ్బారావు, అబ్బూరి వరద రాజేశ్వరరావు, దాట్ల లక్ష్మీ నరసింహరాజు, సంకు పాపారావు, ఎం.రామకోటి, కోరా జగన్ వారిలో కొందరు.

## రిక్షా వాళ్లు బతకాలి కదా!

నాన్నగారు ఎప్పుడూ సైకిల్ రిక్షాలోనే తిరిగేవారు. మరీ దూరం వెళ్లాల్సి వస్తే ఆటోలో వెళ్లేవారు. వయస్సు మీద పడ్డాక ఎండా వానలకు అలా తిరగడం కష్టమవుతున్నప్పుడు 'కారు కొనక్కోవచ్చు కదా' అని అడిగాను. అందుకు చిన్నగా నవ్వేస్తూ, 'రిక్షావాళ్లు, ఆటోవాళ్లు ఎలా బతుకుతారు' అని ప్రశ్నతో బదులిచ్చారు.

## విగ్రహం ముందు కూర్చుంటే ఉపశమనం

నాన్నగారి చివరి క్షణాల్లో నేను అతి దగ్గరగా ఉన్నాను. నా కన్నీళ్లు చూసి, 'నా కథలు చదివితే నాతో మాట్లాడిన అనుభూతి కలుగుతుందిరా' అన్నారు. 1993 నవంబర్ పదో తేదీన కళ్లు తెరిచి ఈ లోకాన్ని చూస్తూ అనంత లోకాల్లోకి అదృశ్యమయ్యే కొద్ది నిమిషాల ముందు వారికి పాదాభివందనం చేశాను. ఇప్పటికీ నేను ఎప్పుడైనా కలత చెందినప్పుడు నాన్నగారి రచనలు చదువుతాను. కలత దూరమౌతుంది. అప్పటికీ ఉపశమనం కలగకపోతే విశాఖపట్నం బీచ్‌లోని నాన్నగారి జీవం ఉట్టిపడే విగ్రహంవద్ద కొంతసేపు కూర్చుంటాను. మనసు చల్లబడుతుంది. ఇంకాఎన్నో విషయాలు చెప్పాలని ఉంది. యారాడ కొండంత నాన్నగారిని అద్దమందు చూపాలంటే కష్టమే మరి! 'రావి శాస్త్రి తెలుగులో రాయడం తెలుగువారి అదృష్టం. ఆయన దురదృష్టం' అని కొందరంటూ ఉంటారు. అందులో కొంత సత్యమున్నా , ప్రతి ఏటా నాన్నగారి పేరు మీద ఒక ఉత్తమ రచయిత(త్రి)కు ఆయన మిత్రబృందం 'రావిశాస్త్రి రచనా పురస్కారం' ఇవ్వడం నేనూ మా కుటుంబం చేసుకున్న పుణ్యం అనుకుంటాను.

ఇంకా....రావిశాస్త్రి రచనల మీద 9 మంది ఎం.ఫిల్, అయిదుగురు పి.హెచ్‌డి చేశారు. ఆయన రాసిన కథ, నవలల్లోని మాండలిక పదాలకు అర్థాలు వివరిస్తూ ఒక నిఘంటువు కూడా వచ్చింది.

-మేడా మస్తాన్ రెడ్డి

## నాకు నచ్చిన మా నాన్న కథ

# ఆఖరి దశ

- రాచకొండ విశ్వనాథశాస్త్రి

**కాశీనగరంలో గంగానదీ తీరాన, తెల్లటి యిసకతిన్నెమీద కూర్చుని సాయంకాలపు సూర్యకిరణాల్లో తళతళలాడే అలలవైపు చూస్తోన్న దేవదత్తుణ్ణి, వెనకనుంచి వచ్చి భుజం మీద గట్టిగా తట్టి పక్కన చతికిల పడ్డాడు చారుదత్తుడు.**

**ఇద్దరూ సమవయస్కులు. నడికాలం దాటి జుత్తుబాగా నెరిసింది. ముఖవర్చస్సు, దుస్తులు విలువా చూస్తే గౌరవ కుటుంబాలకి చెందిన వాళ్ళలా కనిపిస్తున్నారు.**

**''ఏం చారుదత్తా! ఇంత ఆలస్యంగా వచ్చావేం? ఆందోళనగా కూడా ఉన్నట్టున్నావు?''**

**''ఇంకా వార్త వినలేదా ఏమిటి నువ్వు?'' అని ఆశ్చర్యపడుతూ అడిగాడు చారుదత్తుడు''**

''ఏ వార్త? నే నేం వినలేదు. యేమిటో చెప్పు త్వరగా''.

''సుయోధన మహారాజు కూలిపోయాట్ట!''

''హరహరా! ఎప్పుడు?''

''కొద్ది దినాలే అయింది. వార్త యిప్పుడే చేరింది''.

''అంతా ఎలా జరిగింది? వివరాలేమిటి? యేమిటి కథ?''

''చివరికి ఆ భీముడే ప్రాణం పుచ్చుకున్నట్టా''

''అయితే యుద్ధం ముగిసినట్టేనా?''

''ఆ! అధర్మంతో యుద్ధం ముగిసింది''

''అధర్మ యుద్ధం అంటున్నావేమిటి?''

''గదా యుద్ధంలో రారాజుని జయించలేక చివరికి తొడల మీద కొట్టి చంపేట్ట భీమసేనుడు. అలా కొట్టమని పక్కనుండి ప్రోత్సాహించాట్ట కృష్ణుడు.''

''హరహరా! ఈ కృష్ణుడు చేయించే పాపాలకి హద్దున్నట్టు లేదు''

''అతగాడు సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు అవతారం, అతనేం చేసినా తప్పులేదని పాండవుల ప్రచారం''.

''శ్రీ మహావిష్ణువు. ఏదైనా అయుండొచ్చుగాని కొంపలు ముట్టించే కొరివి మాత్రం కాదు''

''కొంపలు ముట్టించే రాజకీయవేత్తలుండబట్టే కథ ఇంతమట్టుకు వచ్చింది. ఈ కృష్ణుడు రాజకీయ వేత్తే కాట్ట. గొప్ప వేదాంతి కూడానట''.

''అదొకటా!''

''కాక పాపం ఆ అర్జునుడు తొలిదినం నాకీ రాజ్యం వద్దు, రాళ్ళూ వద్దు. చూస్తూ చేతులారా వీళ్ళనెవ్వర్నీ నేను చంపలేను, అని అస్త్రసన్యాసం చేసి కూర్చుంటే, ఈ నల్లవాడు మెట్టవేదాంతం అంతా బోధపర్చి పురెక్కించి రెచ్చగొట్టేట్ట''.

''ఆహా! నాకీ విషయం ఇంతవరకూ తెలియలేదుస్మా. అయినా ఆ కిరీటికీ విరక్తి పుట్టి ఉండొచ్చు. కానీ, ఆ పెద్దవాడి రాజ్యకాంక్ష ఎక్కడికి పోతుంది చెప్పూ.''

''ఆకాంక్షే యింతా తెచ్చి పెట్టింది''.

''చూశావా! ప్రాపంచిక సౌఖ్యాల కోసం తండ్రులు, కొడుకులు, అన్నదమ్ములు, బంధువులు, స్నేహితులూ – సాధారణులు కూడా కారు – గొప్పవారు, పండితులు, జ్ఞానులు – అంతా ఒకర్నొకరెలా పొడుచుకు చంపుకున్నారో, వీరితో పాటు అమాయిక ప్రజానీకం ఎంత హతమయిందో!''

''దేవదత్తా! ఎటుచూసినా అధర్మం ప్రబలిపోతోంది. ఆర్యుల్లోనే ఈ అధర్మం పొడసూపినప్పుడు యింక అనార్యుల సంగతి చెప్పవలసిందే ముంది?'' అన్నాడు చారుదత్తుడు విచారంతో.

''ధర్మపద్ధతికి చరమకాలం వచ్చింది'' అన్నాడు దేవదత్తుడు.

''ధర్మాధర్మాల మాటేమిటి? నీకూ, నాకూ, అందరికీ, అన్నిటికీ, ఆర్యావర్తానికే కాదు, మహా ప్రపంచానికే అంత్యకాలం ఆసన్నమయి నట్టుంది''

అంతవరకూ సూర్యకిరణాలు పడి మిలమిల మెరిసిన గంగాజలం కొన్ని చోట్ల ఎర్రబడింది; కొన్ని చోట్ల నల్లబడింది.

''హరహర మహాదేవ శంభో'' అన్న రవం ప్రతి వైపు నుండి వినవస్తోంది. చారుదత్త దేవదత్తులు లేచి విశ్వేశ్వరాలయం వైపు నడిచారు.

***

సాయం సమయం. సంఘారామంలో తటాకానికి దిగే చలువరాతి మెట్ల మీద నిల్చున్నారిద్దరు

### చిన్నకథ అయినా నాకెంతో ఇష్టం...



సూర్య కిరణాల్లో ఏ కిరణం కాంతిమంతమైనది అని అడిగితే చెప్పడం కష్టం. అలాగే మా నాన్న కథల్లో ఏ కథ మీకు నచ్చిందంటే అది కూడా చెప్పడం కష్టం. ఆయన కథలన్నీ నాకు బాగా నచ్చుతాయి. చిన్న కథయినా 'ఆఖరి దశ' అంటే నాకెంతో ఇష్టం. ఎందుకిష్టమో మీరే చదివి తెలుసుకోండి!

-రాచకొండ ఉమా కుమార శాస్త్రి
9848294049

బౌద్ధసన్యాసులు. ఇద్దరూ వృద్ధులు. స్నానం చేసి తుడుచుకుంటూ మాట్లాడుకుంటున్నారు.

''అంతేకాదా నందా! ఈ శంకరాచార్యుడు శివుడి అవతారమట. అందరూ చెప్పుకుంటున్నారు'' అన్నాడు ఉపాలి.

''ఈ బ్రాహ్మణులు మన తథాగతుడే విష్ణ్వంశ సంభూతుడన్నారు. ఆశ్చర్య మేముంది?'' అన్నాడు ఆనందుడు.

''కాని, ఎవడీ శంకరుడు? ఎక్కణ్ణించి ఊడిపడ్డాడు?''

''మంట పుట్టడం మళయాళ దేశంలో పుట్టింది కాని తాత ముత్తాతలెవరో ఇక్కణ్ణించి తర్లివెళ్ళారట అటువైపుకి. పూర్వాశ్రమంలో బ్రాహ్మణాధముడు''.

''అలాచెప్పు. అయితే ఇంతకాలం తథాగతుడికి తలలొగ్గిన బ్రాహ్మణాధములు మంత్ర తంత్రాలతో తిరిగి తల లెత్తుతున్నా రన్నమాట''.

''ఎత్తుతున్నారని మెల్లిగా అంటున్నావా? ఎత్తి పడగ విప్పి ఆడుతున్నారు. వాళ్ళ నాయకుడే ఈ శంకరాచారి''.

ఉపాలి కొంతసేపు మౌనంగా నిల్చొని, ''జాడ్యం విపరీతంగా వ్యాపిస్తోందట కదా'' అని అడిగాడు.

''మనలో దోషాలు పెచ్చుపెరగడం చేతనే దానికి విరుగుడుగా ఇటువంటి జాడ్యం పుట్టుకొచ్చింది''.

''మనలో దోషాలు ఉంటే ఉండవచ్చు. కాని ఈ శంకరాచారే కాని విజయుడయినట్లయితే ప్రజలు పూర్వంలాగే మాడి మసయి పోతారన్న మాట''.

''నిజమే..''

''మనయొక్క ఈ సంఘాలు, మనం, మన ధర్మపద్ధతి, మన భిక్షువులు లేనినాడు ప్రపంచం అంతా చివరి దశకి వచ్చినట్టే'' అని నిట్టూర్చాడు ఉపాలి.

***

తాజ్‌మహల్ సమీపాన సుందరోద్యానంలో పూలమొక్కల మధ్య పచ్చి గడ్డిమీద కూర్చున్నారిద్దరు మహమ్మదీయులు. విలువైన వస్త్రాలు ధరించారు. వారి టోపీలూ, చేతికర్రలూ పక్కన పడివున్నాయి. సాయం కాలపు



నీరెండ తాజ్‌మహల్ అంచులకొక వింతశోభ తెచ్చి పెట్టింది. చల్లని గాలి వీస్తోంది.

''భాయీ, ఔరంగ్‌జేబ్ పాదుషా చనిపోయారని పుకార్ పుట్టింది విన్నావా?'' అని అడిగాడు హుసేన్‌ఖాన్.

''పుకారు మాత్రం కాదు. నిజమే'' అన్నాడు రహీమాన్.

''అరె! నిజమేనంటావా?''

''ఆహా! నిజమే''.

''ఎవరు చెప్పారు నీకు?'

చెవిలో ఏదో మెల్లిగా ఊదాడు రహీమాన్.

''అల్లా, అల్లా! అయితే కబురు నిజమే అయుండాలి'' అని వేదనలో అరిచాడు హుసేన్‌ఖాన్.

''మనం అల్లాని ప్రార్థించడం తప్ప మరింక చేసేదేం లేదు'' అన్నాడు రహీమాన్.

''ఇహ రాజ్యానికి షాజాదాలంతా కొట్టుకు చస్తారు''

''అదెలాగా తప్పదు. అందులో ఎవరునెగ్గినా ఒక్కటే. ధాటీగా పరిపాలించే శక్తి ఎవడికీ లేదు''

హుసేన్‌ఖాన్ నిస్పృహతో అన్నాడు-

''అయితే కాఫిర్లింక మనల్ని బతకనివ్వరు. డెక్కన్లో మరాఠీ దొంగలు ఇదివరకే చెలరేగేరు. ఇటు సిక్కులు కత్తులు నూరుతున్నారు. అంతవరకూ ఎందుకు? ఢిల్లీలోనే ద్రోహం చెయ్యడానికి కాఫర్లు సాహసిస్తున్నారట విన్నావా?''

''మన నీరసం చూసి ఏమైనా చేస్తారు. వేటగాడు లోకువైతే లేడి మూడు కాళ్ళ మీద నడుస్తుందిట!''

''ప్చ! ఖరాబ్ రోజులొచ్చేయి భాయీ''.

''మొగల్ సామ్రాజ్యానికే చెడ్డరోజులొచ్చాయంటే ప్రపంచ శాంతికే భంగం కలిగిందనుకో''.

''కాదా మరి!''

''ఒక కాఫిర్లే కాదు పైనుండి ఇరానీలు, మంగోలీలు, ఇటు కాఫిర్లు, మధ్య మనం. అంతా కలిసి తగవులాడి కొట్టుకొని నానా గోల్‌మాలూ జరుగుతుంది''.

''మరొకటి. ఈమధ్య ఓడల మీద దిగుతున్నారు చూసేవా, తెల్లవాళ్లు! వాళ్ళవైపెవడూ చూడ్డంలేదు. వాళ్ళీ మధ్య కొత్త కొత్త ఆయుధాలు తీసుకొచ్చి జాగ్రత్త చేస్తున్నారట''.

''భాయీ! వీళ్ళూ వాళ్ళూ అనకు. నానా భీభత్సం జరుగుతుంది. ప్రపంచంలో యింక శాంతి అనేది ఉండదు. మొగల్ సామ్రాజ్యానికే ఆఖర్రోజులొచ్చాయి''.

''మొగల్ సామ్రాజ్యానికే ఆఖర్రోజులొస్తే మహాప్రపంచానికి ఆఖర్రోజులొచ్చాయని లెక్కవేసుకో'' అన్నాడు హుసేన్‌ఖాన్.

***

క్రీస్తుశకం, పంధొమ్మిది వందల నలభయ్యేడవ సంవత్సరం ఆగస్టు నెల పదిహేడవ తారీకు.

ఆంగ్లేయులిద్దరు క్లబ్బు వరండాలో వాలుకుర్చీలో కూర్చొని చుట్టలు కాలుస్తూ మాట్లాడుకొంటున్నారు. బాగా చీకటి పడింది. చుట్టూ కలకత్తా నగరం కన్నుల పండువుగా స్వాతంత్ర్యోత్సవాన్ని జరుపుతోంది. దీపాల తోరణాలు ఎటుచూచినా కనిపిస్తున్నాయి. తారజువ్వలు ఆకాశన్నందుకొంటున్నాయి. ప్రతి వైపునుంచీ జయజయధ్వనులు కనిపిస్తున్నాయి.

''ఛార్లెస్! ఈ నాడింత కోలహాలం చేస్తూన్న జనమంతా కొద్దికాలంలో గోరీల్లోనూ, శ్మశానాల్లోనూ ఉంటారు, చూసుకో!'' అన్నాడు రిఛర్డ్.

''బాగా చెప్పేవు'' అన్నాడు ఛార్లెస్.

''పంజాబులో అప్పుడే అల్లర్లు బయల్దేరేయి, తెలుసా?''

''పంజాబ్ అన్నమాటేమిటి? దేశమంతటా బయల్దేరేయి''.

''వీళ్ళుట పరిపాలన సాగించేవాళ్ళు!''

''ఇదంతా వినాశానికే వచ్చింది''

''అంతటికీకారణం, మన దేశంలో చేతకాని గవర్నమెంటు రావడం''

''అదీ ఓ కారణం. అయినా దీన్లో ఫేట్ పని చేస్తూందనుకో. ప్రపంచమంతా కుక్కల నక్కల పాలవుతుంది. మన సామ్రాజ్యం ఇలా నీళ్ళ కలిసిపోతుందా? అటు రష్యన్ భల్లూకం దొరికిన వాళ్ళనందర్నీ భక్షించేస్తోంది? దొరకని వాళ్ళకోసం చేతులు జాస్తోంది''.

''ఇటు ఏటమ్ రహస్యం మనకైనా చెప్పకుండా అమెరికన్లు పట్టుక్కూర్చున్నారు''

''వాళ్ళెందుకు చెప్తారు? మనమీద మెరిగేద్దామని వాళ్లు చూస్తున్నారు కదా!''

''వాళ్ళు వీళ్ళూ మనం కూడా జర్మనీలో బైఠాయించి రాళ్ళు రువ్వుకొంటున్నాం''.


''మన మధ్య జర్మనీయే కాక యూరప్ అంతా నలిగిపోయింది''.

''ఇటు ఆసియాలో ఇండియన్లతో సహా అంతా కొట్టుకు చస్తున్నారు''

''అంతా ఘోరంగా ఉంది''

''చూస్తూవుంటే ప్రపంచానికి ఆఖరి దశ సమీపించినట్టుంది''

''బాగా చెప్పావు''.



***

ప్రపంచం సాగుతూనే ఉంది ఇన్ని వేల సంవత్సరాల నుంచీ, ఇన్ని యుగాలనుంచీ..

❏

*-భారతి, ఆగస్టు* ***1950***